సాక్షి ఒడిశా
బుధవారం । 22 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 6,93,663
బంగారం	600 మిల్లీ గ్రాములు
వెండి	15 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



డిప్యూటీ స్పీకర్‌గా సలుగ ప్రధాన్

రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా సీనియర్ గిరిజన నాయకుడు, జి.ఉదయగిరి నియోజకవర్గం బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే సలుగ ప్రధాన్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- 8లో



నిరంతర ప్రయత్నంతో విజయవంతం

నిరంతర ప్రయత్నంతో జీవితంలో విజయవంతం అవ్వొచ్చని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

'అవినాస్ గొమాంగోకు టిక్కెట్టు ఇవ్వాలి'



వినతిపత్రం అందజేస్తున్న అవినాష్ గొమాంగో తదితరులు

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని గుణుపూర్‌లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. జిల్లాలో అత్యంత కీలకమైన గుణుపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరుపున పోటీ చేసేందుకు అవినాస్ గొమాంగోకు టికెట్టు కేటాయించాలని మద్దతుదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అవినాస్ తన మద్దతుదారులతో కలిసి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగోను మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. పార్టీలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న యువనేతకు టిక్కెట్టు వచ్చేలా కృషి చేయాలని ఆయన మద్దతుదారులు కోరారు. రాజకీయాల్లోకి ఐదేళ్ల క్రితం అరంగ్రేటం చేసిన అవినాస్ డీసీసీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగోకు కొడుకు కావడం విశేషం. అయితే టిక్కెట్ కేటాయించే విషయం అధిష్టానం నిర్ణయిస్తుందని బిజయ్ కార్యకర్తలకు వివరించారు. అవినాస్ వినతిపత్రం సమర్పించిన సమయంలో ఆయనతో పాటు యువ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రునా బవురి, జిల్లా పరిషత్ సభ్యురాలు కుని నిమాల, సీనియర్ నాయకులు గౌరి త్రిపాఠి, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఘసి బౌరి, డీసీసీ సాధారణ కార్యదర్శి ఉనా ఫకీర్ మోహన్, రణనీతి గంట, రఘునాథ్ పాత్రో తదితరులు ఉన్నారు.

అమ్మో పులి



ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్న పోలీసులు



అమర శివారు ప్రాంతం మహేంద్రతనయ నది వద్ద పెద్దపులి అడుగు జాడలు

పర్లాకిమిడి: నగరానికి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గుసాని సమితి అమర గ్రామంలో పులి కనబడిందని గ్రామస్తులు తెలపడంతో, జిల్లా అటవీశాఖ అధికారి సుబ్రహ్మణ్యం ఆనంద్, ఏసీఎఫ్ అశోక్ కుమార్ బెహరా, దేవగిరి రేంజ్ అధికారి ఎన్‌డీ శర్మలు తమ సిబ్బందితో గ్రామానికి మంగళవారం వెళ్లారు. అధికారులు అమర, రట్టిణి (మెళియాపుట్టి మండలం)లో పర్యటించి పులి అడుగు జాడలు గుర్తించడంతో ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. సాయంత్రం ప్రజలు బయట సంచరించవద్దని హెచ్చరించారు. మహేంద్రతనయ నది ఒడ్డున ఉన్న పొలాల్లో అడవి పందులు సంచరిస్తుండంతో వాటిని తినడానికి మకనాపల్లి, దశమంతపురం గ్రామాల్లో పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పులి ట్రాక్ కోసం కెమేరాలు ఏర్పాటు చేశారు.

కరువు గ్రామాల్లో అధికారుల పర్యటన



పంటనష్టం అంచనా వేస్తున్న వ్యవసాయ అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితిలోని కరువు గ్రామాల్లో వ్యవసాయ అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. అంతకు ముందు జిల్లా ముఖ్య వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కాశీనగర్, గుమ్మా, గుసాని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల వలన ఖరీఫ్ వరి పంట దెబ్బతింది. దీంతో గుసాని సమితిలోని కత్తలకవిటి పంచాయతీ కుడ్డడ, ఎంఎస్‌పూర్, బాగుసల ప్రాంతాల్లో పర్యటించారు. వారితోపాటు కత్తలకవిటి సర్పంచ్ బాలరాజు, జిల్లా రైతు సంఘం నాయకుడు సూర్యనారాయణ పట్నాయక్ తదితరులు ఉన్నారు.

పంటకు తెగుళ్లు.. రైతు దిగాలు

- కష్టాల్లో ఖరీఫ్ రైతులు
- తెగుళ్లతో వరిపంట నాశనం
- ఆదుకోవాలని ఆందోళన





పంట పొలంలో దిగాలుగా ఉన్న రైతులు



తెగుళ్లు సోకిన వరిచేనుతో ఆందోళన చేస్తున్న రైతులు

బరంపురం: గంజాం జిల్లా రైతులకు ప్రకృతి వైపరీత్యాలు ప్రతిఏటా శాపంగా మారుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొన్నిసార్లు అతివృష్టి, మరికొన్నిసార్లు అనావృష్టి కాటేస్తున్నాయి. దీంతో నిత్యం కష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో జిల్లా రైతులకు కరువు రక్కసి కాటేసింది. ప్రభుత్వ సహకారం కోసం బిక్కచూపులతో ఎండిన వరి పొలాన్ని చూస్తు కన్నీరు కారుస్తున్నారు. వేలాది హెక్టార్లలో వరిపంటకు తెగుళ్లు సోకడంతో తీవ్ర కలత చెందుతున్నారు.

అపార నష్టం

జిల్లాలోని సరగడా, చికిటి, బంజనగర్, జగన్నాథ్‌ప్రసాద్ బ్లాక్‌లతో పాటు మెరక ప్రాంతాల్లో వరిపంటకు తెగుళ్లు సోకి అపార నష్టం వాటిల్లుతోంది. ప్రస్తుతం పొలాలకు వెళ్లి చూస్తే మరికొన్ని రోజుల్లో చేతికి అందాల్సిన పంట దోమపోటు, కుళ్లు తెగులకు గురవ్వడంతో ఎండిపోయింది. ఎక్కడబడితే అక్కడ కుళ్లు తెగుళ్లు, దోమపోటు అధికం కావడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. తెగుళ్లు పీడిస్తుండడంతో పంటలను పొలాల్లోనే వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెగుళ్ల నివారణ మందులు కొనుగోలు భారం అవ్వడంతో చివరకు పొలాలవైపు కన్నెత్తి చూడని పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల చేసేదేమీలేక పంటను పొలాల్లోనే తగలబెడుతున్నారు. పంట నష్టం అంచనాలకు వెళ్తున్న అధికారులు సైతం తెగుళ్లను చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హింజిలికాట్, కబిసూర్యనగర్, సరగడా, ఛత్రపూర్, గంజాం, రోంగాయిలోండా, చికిటి, కుకుడాఖండి, దిగపాండి, సన్నోఖేముండి, బుగడా సమితుల్లో తెగుళ్లతో సుమారు 8 వేల హెక్టార్ల పంటకు నష్టం వాటిల్లిందని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (డీడీఏ) మనోజ్ బెహరా తెలియజేశారు.

రైతుల ఆందోళన

జిల్లాలోని సరగడా బ్లాక్‌లో రైతులు తెగుళ్లు సోకిన వరి పంటతో బ్లాక్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మరోవైపు చికిటి బ్లాక్‌లో ఖరీఫ్ రైతులు చేసేదేమీలేక పంటకు నిప్పు పెడుతున్నారు.

నేటి నుంచి తులసీ యాత్ర



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు గొమాంగో

రాయగడ: రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి తులసీ యాత్రను ప్రారంభిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగో ప్రకటించారు. స్థానిక కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ పుణ్యక్షేత్రం పూరీలో భక్తుల సౌకర్యార్థం నాలుగు ద్వారాలను తెరవాలని డిమాండ్ చేస్తూ తమ పార్టీ తులసీ యాత్ర పేరిట నిరసన తెలియజేస్తుందన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల నుంచి యాత్రను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. నవంబర్ 30వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పంచాయతీల నుంచి సేకరించిన తులసీ దళాలను రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని పీసీసీ కార్యాలయానికి తరలిస్తామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సంగ్రహించిన తులసీ దళాలు డిసెంబర్ 2వ తేదీన పూరీలోని జగన్నాథుని సన్నిధికి చేరేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ బృహత్తర కార్యక్రమం విజయవంతమయ్యేలా అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అప్పలస్వామి కద్రక తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ప్రగతికి ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: సహకార సంస్థలు వ్యవసాయం, పరిశ్రమల ప్రగతికి ప్రాధాన్యమివ్వాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి కోరారు. పట్టణ శివారు పూర్ణఘడ్‌లోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో జిల్లాస్థాయి సహకార వారోత్సవ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, పారిశ్రామవేత్తలు, స్వయం సహాయక గ్రూపుల మహిళలు, సాధారణ ప్రజలు సహకార సంస్థలతో లావాదేవీలు జరుపుకోవాలని సూచించారు. అప్పుడే సహకార ఉద్యమం ప్రగతి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు. కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పడాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రగతిలో సహకార సంఘాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఖరీఫ్ నుంచి రూ.లక్ష వరకు వడ్డీ లేకుండా వ్యవసాయ రుణం ఇస్తోందని వెల్లడించారు. అలాగే రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు కేవలం 2 శాతం వడ్డీకే రుణాలు అందజేస్తోందన్నారు. కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వరచంద్ర పాణిగ్రాహి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకార బ్యాంక్‌ల ఉన్నతికి ప్రతీ సమితిలో 2 ఎకరాల స్థలం, రూ.2 కోట్లు మంజూరు చేస్తోందని వెల్లడించారు. అలాగే మూతపడిన ల్యాంపులను పునరుద్ధరించి వాటిని అభివృద్ధి చేసేందుకు రూ.25 లక్షలు చొప్పున కేటాయించటం జరుగుతోందన్నారు. జిల్లా సహకార సంఘ అధ్యక్షుడు డా.హేమంత కుమార్ నాయిక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పొట్టంగిఎమ్మెల్యే ప్రీతం పాఢీ, కోట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మిణీ దియాన్, స్వతంత్ర్య ఆదివాసీ అభివృద్ధి పరిషత్ అధ్యక్షుడు చంద్రశేఖర మఝి, సహకార డిప్యూటీ డైరెక్టర్ భీమసేన్ సాహు, కేసీసీ బ్యాంక్ కార్యదర్శి అభయ కుమార్ లెంక, కేసీసీ బ్యాంక్ ఉపాధ్యక్షుడు ధృపద భొత్ర, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు రాధా బినోద్ సామంతరాయ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ వర్గాల ప్రజలు

చేపల పెంపకంతో అధిక లాభాలు



మత్స్యకారుడిని సన్మానిస్తున్న దృశ్యం

- కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్
- ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం



వేదికపై అధికారులు, నాయకులు

పర్లాకిమిడి: జిల్లాలో అధికంగా చేపల చెరువులు ఉన్నందున, చేపల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీఎం నవీన్ పట్నాయక్ మత్స్యజీవి కల్యాణ యోజన స్కీమ్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. మత్స్యకారులు, గ్రామీణ స్వయం సహాయక గ్రూపుల మహిళలు చేపల చెరువులకు ఉపయోగించే ఏరియేటర్‌ను రూ.30 వేలకు కొనుగోలు చేస్తే, రూ.12 వేల సబ్సిడీ లభిస్తుందని కలెక్టర్ ప్రధాన్ అన్నారు. చేపలు, రొయ్యల పెంపకంపై మత్స్యకారులు దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లాలో చేపల పెంపకం విజయవంతంగా నిర్వహిస్తున్న మత్స్యకారులను సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యానవన ఉపసంచాలకుడు సుశాంత రంజన్ దాస్, జిల్లా ముఖ్య ప్రాణి చికిత్సాధికారి డా.ధర్మేంద్ర మహంతి, అదనపు జిల్లా ప్రాణి చికిత్సాధికారి డాక్టర్ నారాయణ మహాపాత్రో, సబ్ డివిజనల్ ప్రాణి చికిత్సాధికారి డా.రమాకాంత రోణా, జిల్లా మత్స్యాధికారి లిసా బెహరా, ఆర్.ఉదయగిరి బ్లాక్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ బెహరా, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, గుమ్మా సమితి నుంచి సునేమీ మండల్, రాయఘడ నుంచి పూర్ణబాసి నాయక్‌లు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.

నకిలీ గుట్కా కర్మాగారంపై దాడి



సీజ్ చేసిన గుట్కా సామగ్రి



కర్మాగారంలో దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

బరంపురం: నగర శివారు హల్దియాపదర్ రహదారిలో నకిలీ గుట్కా కర్మాగారంపై బరంపురం పోలీసులు మంగళవారం దాడి చేశారు. నగర ఎస్డీపీవో శిబశంకర్ మహాపాత్రో తెలిపిన వివరాల మేరకు.. గుసానినువాగాం పోలీసుస్టేషన్ పరిధి టెర్మినల్ బస్టాండ్ దగ్గర 16వ నంబర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న హల్దియాపదర్ గ్రామంలో కొద్దికాలంగా రహస్యంగా నకిలీ గుట్కా కర్మాగారం నడుస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్పీ సార్వణ్ వివేక్ ఆదేశంతో ఎస్డీపీవో శిబశంకర్ మహాపాత్రో నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందం కర్మాగారంపై దాడులు నిర్వహించింది. దీనిలో భాగంగా భారీగా గుట్కా సామగ్రి, లేబుల్స్ మరియు యంత్రాలు స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. సీజ్ చేసిన యంత్రాలు, సామగ్రి విలువ సుమారు రూ.10 కోట్లు ఉంటుందని అంచనా. అరెస్టైనవారిలో నగరంలోని బాలింకేశ్వర్ వీధికి చెందిన పి.బ్రహ్మం, హిల్‌పట్నా వీధికి చెందిన సుబ్రత కుమార్ బెహరాలు ఉన్నట్లు వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న సామగ్రి



స్వాధీనం చేసుకున్న నకిలీ గుట్కా తయారీ లేబుల్స్ రీల్స్



సోదాలు నిర్వహిస్తున్న ఎస్డీపీవో శిబశంకర్ మహాపాత్రో తదితరులు



సీజ్ చేసిన గుట్కా తయారీ యంత్రాలు

అదుర్స్..!



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

స్థానిక గంజాం కళా పరిషత్ ప్రాంగణంలో గంజాం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో 5వ గంజాం జిల్లా సాంస్కృతిక మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా పాల్గొని ప్రారంభ జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మన భాష, కళలు, సంస్కృతులను పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక కళాకారులు ప్రదర్శించిన రణాప్ప, కూచిపూడి, సంబల్‌పూరి, ఆధునిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.

- బరంపురం



ఆకట్టుకుంటున్న రణాప్ప నృత్యం



సంబల్‌పూరీ నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు



ఆధునిక నృత్యాలు చేస్తున్న యువతులు

నిరంతర ప్రయత్నంతో విజయవంతం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- పహాడ్‌పూర్‌లో నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం



నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న రాష్ట్రపతి ముర్ము

భువనేశ్వర్: నిరంతర ప్రయత్నంతో జీవితంలో విజయవంతం అవ్వొచ్చని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మయూర్‌భంజ్ జిల్లా పహాడ్‌పూర్‌లో నైపుణ్య శిక్షణా కేంద్రం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన వర్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. 2013–14 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌తో పోలిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో పరిమాణం దాదాపు 3 రెట్లు పెరిగిందని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి లేకుండా సమ్మిళిత అభివృద్ధి అసంపూర్ణమన్నారు. అందుకే గిరిజన సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గిరిజన యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్వీయ అభివృద్ధికి సొంత ప్రయత్నం కూడా అవసరమని ఉద్ఘాటించారు. యువత తమ జీవితంలో ముందుకు సాగేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలని ప్రబోధించారు. పీవీటీజీల అభివృద్ధికి ప్రభుత్వం ఈ ఏడాది జన జాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా పీఎం జన్ మాన్ (పీఎం – జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్)ను ప్రారంభించిందని తెలిపారు. గిరిజన సోదర సోదరీమణుల ప్రగతికి ఇదో ముందడుగు అన్నారు.

బాలలతో రాష్ట్రపతి సంభాషణ

అనంతరం పహాడ్‌పూర్ గ్రామంలో ఎస్‌ఎల్‌ఎస్ మెమోరియల్ రెసిడెన్సియల్ పాఠశాలను రాష్ట్రపతి సందర్శించారు. అక్కడ ఆమె విద్యార్థులతో సంభాషించి ముచ్చట గొలిపించారు. పాఠశాల ఆవరణలో దివంగత శ్యామ్ చరణ్ ముర్ము విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్, కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్విని వైష్ణవ్, బిశ్వేశ్వర్ టుడు, ఎంపీ సుదామ్ మార్ండి పాల్గొన్నారు.



సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం



రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభాన్ని పురస్కరించుకుని అధికార పక్షం బిజూ జనతా దళ్ సభ్యులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశాలు ప్రారంభానికి కొద్ది సమయం ముందుగా ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల సమావేశాలు 2024లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగే చివరి సమావేశాలు కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

- భువనేశ్వర్

రవాణా సౌకర్యాలతోనే అభివృద్ధి



పచ్చజెండా ఊపి కొత్త రైలు సేవలు ప్రారంభిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- మూడు కొత్త రైళ్లను ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: రవాణా సౌకర్యాలతోనే ఒక ప్రాంతం అభివృద్ధి ఆధారపడి ఉంటుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మంగళవారం బాదంపహాడ్ రైల్వే స్టేషన్ నుంచి బాదంపహాడ్ – టాటానగర్ మెమూ, బాదంపహాడ్ – రౌర్కెలా వీక్లీ ఎక్స్‌ప్రెస్ మరియు బాదంపహాడ్ – షాలిమార్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైలు, మోటారు లేదా తపాలా సేవలు ప్రజల దైనందిన జీవితాలను సులభతరం చేస్తాయన్నారు. కొత్తగా ప్రారంభించిన 3 రైళ్లు జార్ఖండ్ మరియు పశ్చిమ బెంగాల్ వంటి పొరుగు రాష్ట్రాలకు ప్రయాణించడానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఒడిశాలోని పారిశ్రామిక పట్టణం రౌర్కెలాను సందర్శించడానికి ప్రజలకు అసౌకర్యం తొలగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కొత్త రాయంగ్‌పూర్ పోస్టల్ డివిజన్‌ను రాష్ట్రపతి వర్చువల్ మాధ్యమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయరంగ్‌పూర్ పోస్టల్ డివిజన్ స్మారక ప్రత్యేక కవర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా బాదంపహాడ్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి పునాది రాయి వేశారు. సెల్‌ఫోన్లు, కొరియర్ సేవల ఆదరణ పెరుగుతున్నప్పటికీ ఇండియా పోస్టు తన ఔచిత్యాన్ని కోల్పోలేదని పేర్కొన్నారు. రాయరంగ్‌పూర్‌లో కొత్త పోస్టల్ డివిజన్ ప్రారంభోత్సవం ఈ ప్రాంతానికి ఒక ముఖ్యమైన హంగుగా మిగులుతుందన్నారు. తదుపరి బాదంపహాడ్ – షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో బాదంపహాడ్ నుంచి రాయరంగపూర్ వరకు ప్రయాణించారు.



రాయరంగపూర్ పోస్టల్ డివిజన్ స్మారక ప్రత్యేక కవర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

‘తెప్పోత్సవంలో భక్తులకు పక్కా ఏర్పాట్లు చేయాలి’



ధర్మానకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్, ట్రస్టీలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఇంద్ర పుష్కరిణిలో ఈ నెల 24న జరగనున్న తెప్పోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు, లోపాలు లేకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచించారు. అరసవల్లి క్షేత్రంలో జరగనున్న హంసనావికోత్సవానికి (తెప్పోత్సవం) మంత్రి ధర్మాన ప్రసాదరావుకు పెద్దపాడు క్యాంపు ఆఫీస్‌లో మంగళవారం ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, పాలకమండలి సభ్యులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ తెప్పోత్సవానికి వేలల్లో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, గత లోపాలు పునరావృతం కాకుండా తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. అలాగే ఈ మేరకు ఏర్పాట్లను పాలకమండలి సభ్యులు పరిశీలించాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, ఉకలాపు గోవిందరావు, దుక్క గనిరాజు, జె.శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి ఉన్నారు.

దారి కాచిన మృత్యువు

- ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు ఒడిశా గిరిజనులు మృతి
- 25 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- మందస మండలంలో ప్రమాదం



సంఘటనా స్థలంలో బోల్తాపడిన ట్రాక్టర్



మరణించిన బుయ్యా జగన్నాథ్



సవర ఈశ్వర్ మృతదేహం



క్షతగాత్రులను 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

మందస: రెండు ట్రాక్టర్ల కోసం మాట్లాడుకుంటే.. ఒకటే వచ్చింది. పాతిక మందికి కూడా పట్టని ట్రాక్టర్ తొట్టెలో.. ఏకంగా యాభై మంది ఎక్కేశారు. సమావేశంలో పాల్గొనడానికి ప్రాణాలను బలిపెట్టారు. ఇన్ని కలగలిపి ఇద్దరు గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు. మరో పాతిక మంది గాయాలపాలయ్యారు. మందస మండలంలోని తాళ్లగురంటి పంచాయతీ గౌడుగురంటి సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడి ఒడిశా బురతలో పంచాయతీ గుడ్డిపద్రో గ్రామానికి చెందిన సవర ఈశ్వర్ అలియాస్ డెరా(55), కుసుమలో గ్రామానికి చెందిన బుయ్యా జగన్నాథ్(47)లు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే..

మందస మండలం తాళ్లగురంటి సరిహద్దులోని గల ఏఓబీ ప్రాంతంలో గల గంజాం జిల్లా పాత్రపురం బ్లాక్ చీకటి నియోజకవర్గం పరిధిలో గుడ్డిపద్రో, తాళబడో, కుసుమల, లియాబలి, అడపాత్ర, బత్తరసాయి తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు ఒడిశాలోని చీకటి గ్రామంలో జరిగే ఓ సమావేశానికి వెళ్లడానికి నిర్ణయించుకున్నారు. మందస మండలంలోని బుడారిసింగి ప్రాంతంలో రెండు ట్రాక్టర్లను అద్దెకు మాట్లాడుకున్నారు. అయితే మంగళవారం బుడారిసింగికి చెందిన ఒక్క ట్రాక్టర్ మాత్రమే ఆ గ్రామానికి వెళ్లింది. దీంతో సుమారు 50 మంది వరకు గిరిజనులు ఆ ట్రాక్టర్‌లోనే కర్రలను సాయంగా పెట్టి, వాటిని పట్టుకుని ప్రయాణం సాగించారు. సంబంధిత గ్రామాల నుంచి చీకటికి మందస మండలంలోని తాళ్లగురంటి ప్రాంతం నుంచే దారి ఉంది. అయితే బండి గౌడుగురంటి సమీపంలో గల కల్వర్టు వద్దకు వచ్చేసరికి మలుపు ఉంది. సరిగ్గా అదే ప్రాంతంలో డ్రైవర్ కాస్త ఏమరపాటుగా వ్యవహరించడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో సవర్ ఈశ్వర్, బుయ్యా జగన్నాథ్ సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రుల హాహా కారాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. కార్జి మమత, సవర సంతోష్, సవర సున్నారి, సవర గురుమూర్తి, సవర రాజులకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రమాద సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, బుడారిసింగి సర్పంచ్ సురేష్ కుమార్‌పాణిగ్రాహి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో సహాయ చర్యలు చేపట్టారు. మందస, పలాస, సోంపేట, కంచిలి 108 అంబులెన్స్‌లకు, మందస పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను 108 వాహనాల్లో ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో సవర శ్రీపతి, గణేష్, కుక్కిలి, అనంత్, ప్రసాద్, జోగారావు, మంగళ, ఖెండి, దుల్లభో, సుక్కు, సబిత, రొయిబారి, హడియాని, లక్ష్మి, దాలి మ, ఇసంగో, సుక్రు, చంద్రి, గందర, కూర్మా, నారాయణ, సుమతో తదితరులకు గాయాలయ్యాయి. ఘటనాస్థలానికి చేరుకున్న స్థానికులు క్షతగాత్రులకు సాయమందించారు. మందస, పలాస ప్రభుత్వాస్పత్రులకు 25 మందిని పంపగా.. వారిలో నలుగురిని శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. కాశీబుగ్గ రూరల్ సీఐ శంకరరావు, మందస ఎస్‌ఐ సీహెచ్ హరికృష్ణ సంఘటనా స్థలానికి వెళ్లి.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన ఓ గిరిజన వృద్ధురాలు

శీతాకాల సమావేశాలు ప్రారంభం



సంతాపం తెలుపుతున్న సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన ప్రముఖులకు సంస్మరణగా మౌనం పాటించారు. సభ సమావేశం కావడంతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మాజీ స్పీకర్ మహేశ్వర్ మహంతి, మాజీ మంత్రి సరస్వతి ప్రధాన్, మాజీ అధికార పార్టీ చీఫ్ విప్ అజయ్ కుమార్ జెనా, మాజీ ఎమ్మెల్యే రబీ దాస్, మాజీ ఎమ్మెల్యే జుధిష్టిర్ సామంత్రాయ్, మాజీ హవల్దార్ సరోజ్ కుమార్ దాస్ మరియు మాజీ బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ ప్రకాష్ చంద్ర సియల్ మృతికి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి ప్రతిపక్ష చీఫ్ విప్ మోహన్ మాఝి, కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత నరసింగ మిశ్రా మద్దతు తెలిపారు. నరసింగ మిశ్రా తన ప్రసంగంలో ఒడియా మరియు కోశలి భాషల్లో సంతాప సందేశం ప్రవేశపెట్టారు.

అనంతరం దివంగతుల ఆత్మకు శాంతి చేకూరాలని సభలో సభ్యులు ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం స్పీకర్ ప్రమీలా మల్లిక్ సభా కార్యక్రమాలను రేపటికి వాయిదా వేశారు. డిప్యూటీ స్పీకర్‌గా బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే సలుగ ప్రధాన్ ఏకగ్రీవంగా ఎన్నికైన తర్వాత అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి.

క్లుప్తంగా

డిప్యూటీ స్పీకర్‌గా సలుగ ప్రధాన్



డిప్యూటీ స్పీకర్ సలుగ ప్రధాన్

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా సీనియర్ గిరిజన నాయకుడు, జి.ఉదయగిరి నియోజకవర్గం బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే సలుగ ప్రధాన్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రజనీకాంత సింగ్ రాజీనామా చేయడంతో నవంబర్ 8న ఖాళీ అయిన ఈ పదవి భర్తీ అయింది. డిప్యూటీ స్పీకర్ ఎన్నికకు ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ (బీజేపీ), కాంగ్రెస్ పోటీదారులను బరిలోకి దింపలేదు. దీంతో బీజేడీ అభ్యర్థి సలుగ ప్రధాన్ ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఈ సందర్భంగా సలుగ ప్రధాన్ మాట్లాడుతూ.. సీఎం నవీన్ పట్నాయక్ తనను డిప్యూటీ స్పీకర్ పదవికి ప్రతిపాదించి గెలిపించారన్నారు. ఈ హోదాలో సభా కార్యక్రమాలు సజావుగా సాగేందుకు సీనియర్ సభ్యుల సలహాలు తీసుకుంటానని పేర్కొన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల అభిప్రాయాలను గౌరవిస్తానని తెలిపారు.

బలపడుతున్న గిరిజన ప్రాతినిధ్యం

ముఖ్యమైన పదవుల్లో గిరిజన ప్రాతినిధ్యం బలోపేతం చేసేందుకు అధికార పార్టీ చేస్తున్న ప్రయత్నాలు వరుసగా ఫలప్రదం అవుతున్నాయి. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఇప్పటికే ముగ్గురు గిరిజన నాయకులు జగన్నాథ్ సరకా, సుదామ్ మరాండి మరియు బాసంతి హేంబ్రమ్‌లను మంత్రులుగా నియమించారు. ప్రతిపక్ష పార్టీలు అభ్యర్థిని నిలబెట్టకపోవడంతో డిప్యూటీ స్పీకర్ పదవికి సలుగ ప్రధాన్ ఎన్నిక కావడంతో అధికార పక్షం బిజూ జనతా దళ్ సభలో ఆధిక్యత మరింత పుంజుకుంది.

గంజాయి పంట ధ్వంసం



గంజాయి మొక్కలు ధ్వంసం చేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి నువాగుడ పంచాయతీ చిడపక గ్రామంలో చిత్రకొండ ఎక్సైజ్ పోలీసులు 35 వేల గంజాయి మొక్కలను మంగళవారం ధ్వంసం చేశారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఎస్పీ నితీష్ వాద్వానీ ఆదేశాల మేరకు గంజాయి మొక్కలను దగ్ధం చేశారు. వాటి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. గంజాయి సాగుచేస్తే చర్యలు తప్పవని చిత్రకొండ ఐఐసీ ముకుంద మేల్కా తెలియజేశారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



కలపతో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి పద్మాగిరి పంచాయతీ నుంచి ఒక పికప్ వ్యాన్‌లో ఛత్తీస్‌ఘడ్ సుకుమ జిల్లాకు చెందిన రాము పోడియమి, గంగా నాగ్ అనే ఇద్దరు వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్నారు. వీరిని సోమవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకొని కలపను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరినీ అరెస్టు చేశారు. వారిని విచారించగా కలపను విశాఖపట్నం తరలిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం కోర్టులో హాజరుపరిచారు.

చెన్నై సందర్శనకు గిరిజన యువత



గిరిజన యువతతో బీఎస్‌ఎఫ్ జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాకు చెందిన 20 మంది గిరిజన యువతను చెన్నై సందర్శనకు తీసుకెళ్తున్నట్లు బీఎస్‌ఎఫ్ డీఐజీ సైలేంద్ర కుమార్ సిన్హా మంగళవారం తెలియజేశారు. జవాన్ల సొంత ఖర్చులతో తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 15 బృందాల గిరిజన యువతను పలు రాష్ట్రాల సందర్శనకు తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

ఈనెల 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వీరి ప్రయాణం సాగుతుందని తెలిపారు. వీరిలో 10 మంది బాలికలు, 10 బాలురు, ఆరుగురు జవాన్లు వెళ్తారన్నారు. సమావేశంలో మల్కన్‌గిరి రెండో బెటాలియాన్ కమాండర్, వరునేంద్ర ప్రతాప్ సింగ్, డిప్యూటీ కమాండర్ రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


తిరుపతిరావు (ఫైల్)

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన యువకుడు పామోటి తిరుపతిరావు (25) పురుగు మందు తాగి విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తిరుపతిరావు బీఏ చదువుకున్నాడు. కొన్నాళ్ల పాటు హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ ఉద్యోగం చేసి మానేసి ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకోసం పరీక్షలురాసి, ఇతర కాంపిటీటివ్ పరీక్షల కోసం చదువుతున్నాడు. తన స్నేహితులు మిలటరీ ఉద్యోగాలకు ఎంపికై శిక్షణ పొందుతుండడంతో తాను ఉద్యోగం సాధించలేకపోయానని మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుమందు తాగేశాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు చికిత్సకోసం స్థానిక సీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ మేరకు కేంద్రాస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుని సోదరుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆర్.జయంతి చెప్పారు.

రిమాండ్ ఖైదీ పరారీ

విజయనగరం క్రైమ్: రిమాండ్‌లో ఉన్న ఖైదీ జిల్లా కేంద్రంలో మంగళవారం పరారయ్యాడు. దీనికి సంబంధించి టూటౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పిల్ల సూకరాజును విచారణ నిమిత్తం ఏఆర్ పోలీసులు మంగళవారం పూల్‌బాగ్‌లో ఉన్న జిల్లా కోర్టుకు తీసుకువచ్చారు. కోర్టు వద్ద మధ్యాహ్న భోజనాన్ని అందిస్తుండగా పోలీసులను తోసివేసి అక్కడి ఖైదీ పరారయ్యాడు. గతంలో యలమంచిలి వద్ద ఇదేవిధంగా తప్పించుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఏఆర్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌శంకర్ తెలిపారు.

15 మంది జూదరుల అరెస్టు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలోని ఓ లేవుట్‌లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సీఐ ఎస్. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. పేకాట ఆడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి నుంచి రూ.1.55 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు హేమంత్‌కుమార్, వీరజనార్దన్ పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి


పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేసి అమ్మవారికి ప్రీతికరమైన తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో వేదపండితులు చండీయాగం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కెఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

ఖోఖో పోటీలకు జిల్లా జట్ల పయనం


రాష్ట్రస్థాయి పోటీలకు పయనమైన జిల్లా ఖోఖో జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్‌గేమ్స్ ఖోఖో పోటీల్లో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్లు మంగళవారం పయనమయ్యాయి. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు నంద్యాలలో 19 సంవత్సరాలలోపు వయస్సు గల విద్యార్థులకు జరగనున్న పోటీల్లో జిల్లా క్రీడాకారులు పోటీ పడనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు జిల్లా అండర్-19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ పలు సూచనలు చేశారు. క్రీడాస్ఫూర్తితో ఆడి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎం.ఆర్.అగ్రహారంలో తడిచిన వరి పనలు (ఇన్‌సెట్‌) సంతకవిటిలో వరి కుప్పలను టార్పాలిన్‌తో కప్పిన దృశ్యం



చివరిలో టెన్షన్..

జిల్లాలో వరి పంట కోతదశకు చేరింది. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రెండు రోజులుగా వాతావరణ ప్రతికూలతలతో రైతుల్లో టెన్షన్ మొదలైంది. చాలా చోట్ల చిరుజల్లులు కురవడంతో కోసిన చేను తడిసిముద్దయింది. కొందరు రైతులు మంగళవారం కోతను వాయిదా వేయగా, ఎండిన చేనును కుప్పలుగా చేర్చడంలో నిమగ్నమయ్యారు. ‘చివరి’లో పంటను రక్షించుకునేందుకు ఆరాటపడుతున్నారు. మరో పక్షం రోజులపాటు వాతావరణం సహకరిస్తూ వరిచేను కళ్లాలకు చేరుతుందని అభిప్రాయపడుతున్నారు.

– సంతకవిటి

అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటాం


విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

పూసపాటిరేగ: విశాఖ ఫిషింగ్ హార్బర్ అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. హార్బర్‌లో ఈనెల 19 తేదీన జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన, మునిగిపోయిన బోట్లను మంగళవారం పరిశీలించారు. బోట్లు కోల్పోయిన బాధితులను పరామర్శించారు. ప్రమాదంలో నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన బాధితులకు జరిగిన నష్టంపై సుబ్బారెడ్డికి సురేష్‌బాబు వివరించారు. భోగాపురం మండలం ముక్కాంపంచాయతీకి చెందిన 12 బోట్లు, చేపలకంచేరు పంచాయతీకి చెందిన 7 బోట్లు, పూసపాటిరేగ మండలం కోనాడకు చెందిన ఒక బోటు అగ్నికి ఆహుతయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో 45 బోట్లు అగ్నికి ఆహుతికావాడంతో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయారన్నారు. తక్షణమే స్పందించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బోట్లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున 80 శాతం నష్టపరిహారం ఇవ్వడానికి నిర్ణయించడం శుభపరిణామమన్నారు. బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. హార్బర్‌ను పరిశీలించిన వారిలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వరుదు కల్యాణి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ , వైఎస్సార్‌సీపీ విశాఖపట్టణం జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నవరత్నాలు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మెన్ అంకంరెడ్డి నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

రెండు నెలల పాటు వికసిత భారత్ యాత్ర

- కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి రోహిత్ మాధుర్


మాట్లాడుతున్న కేంద్రప్రభుత్వ సంయుక్త కార్యదర్శి రోహిత్ మాధుర్

విజయనగరం అర్బన్: సమాజంలోని వివిధ వర్గాల కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలను అర్హులైన వారికి చేర్చడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సంయుక్త కార్యదర్శి రోహిత్ మాధుర్ చెప్పారు. నవంబరు మూడో వారంలో జిల్లాలో ఈ యాత్ర ప్రారంభమై రెండు నెలలపాటు జనవరి 26వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. ఈ యాత్ర నిర్వహణ కోసం జిల్లా ప్రభారీ అధికారిగా నియమితులైన ఆయన జిల్లాస్థాయిలో ఈ యాత్ర నిర్వహణలో భాగస్వాములైన అధికారుల కమిటీతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. కేంద్ర పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి వాటిని వినియోగించుకునేలా చైతన్య పరచడం, అర్హులై ఉండి ఈ పథకాలు పొందని వారిని గ్రామాల్లో జరిగే యాత్ర సందర్భంగా గుర్తించి వారికి ఆయా పథకాల ప్రయోజనాలు అందేలా చూడడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని సమావేశంలో చెప్పారు. అర్హులైన వారికి అవసరమైన డాక్యుమెంట్లు లేని పక్షంలో వాటిని సమకూర్చి పథకాలు మంజూరు చేయడంలో అధికారులు, సిబ్బంది చొరవ చూపాలని కోరారు. ఈ యాత్రలో భాగంగా వంటగ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయాలని హెచ్‌పీసీఎల్ అధికారి శ్రీహర్షను కోరారు. జిల్లాలో ఈ యాత్రకు చేసిన ఏర్పాట్లను కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి, జిల్లాస్థాయి నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఆస్మా పర్వీన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ సంయుక్త కార్యదర్శి కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ నాగలక్ష్మితో భేటీ అయి జిల్లాలో వికసిత భారత్ సంకల్ప్ యాత్రకు చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు.

30 నిమిషాల్లో రిజిస్ట్రేషన్


నూతన పద్ధతిలో రిజిస్ట్రేషన్ పూర్తిచేసిన దస్తావేజును అందజేస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి

కొత్తవలస: ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేశామని, ఇకపై ఎలాంటి మధ్యవర్తులు లేకుండా 30 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తిచేసే వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పి.విజయలక్ష్మి తెలిపారు. ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తెచ్చిన ప్రీమియం-2.0 సాఫ్ట్‌వేర్ సాయంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొత్తవలస సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ చేయించుకోబోయే వ్యక్తి నేరుగా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దరఖాస్తు నింపి సిబ్బందికి అందజేసిన 30 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్కరోజే 61 దస్తావేజులను రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేసామన్నారు. కార్యక్రమంలో కొత్తవలస సబ్‌రిజిస్ట్రార్ టి.తారకేశ్వరరావు, సీపీ పి.ప్రశాంత్‌కుమార్, సిబ్బంది వై.తేజేశ్వరరావు, ఎం.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు



రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: ఈనెల 18,19 తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. సబ్ జూనియర్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు మొత్తం 24 పతకాలు సాధించడంతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్‌లో ద్వితీయస్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 10 బంగారుపతకాలు, 9 వెండి పతకాలు, 5 కాంస్య పతకాలు చేజిక్కించుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులను తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు, కోచ్‌లు యశస్విని, గగన్, చైతన్యలు అభినందించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- ఆర్డీవో సూర్యకళ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యకళ

విజయనగరం రూరల్: రసాయన పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు వాటి యాజమాన్యాలే భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలని విజయనగరం ఆర్డీవో, లోకల్ క్రైసిస్ గ్రూప్ చైర్మన్ సూర్యకళ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో లోకల్ క్రైసిస్ గ్రూప్ సభ్యులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రసాయన పరిశ్రమల్లో ఏమైనా ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, అలాగే పరిశ్రమలను ఆనుకుని ఉన్న గ్రామాల్లో తీసుకోవాల్సిన భద్రతా నియమాలపై సమావేశంలో ఆమె చర్చించారు. సమావేశంలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఇన్‌చార్జ్ జీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ రసాయన పరిశ్రమల్లో 6 నెలలకు ఒకసారి ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి సోమేశ్వరరావు, సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ అల్లు సూరిబాబు, పూసపాటిరేగ తహసీల్దార్ ఐ.భాస్కరరావు, ఎంపీడీవో ఎం.రాధిక, ఎస్సై జి.బాలకృష్ణ, పీహెచ్‌సీ వైద్యుడు రాజేష్ వర్మ, జి.చోడవరం సర్పంచ్ కె.శ్రీరాములు, ఎన్జీవో ఆర్ఎల్ఎన్ శర్మ, సామాజిక కార్యకర్త ఎం.రాము, ఫ్యాక్టరీ వైద్యాధికారి ఎం.విజయ్‌కుమార్, ఉదయ్‌భాస్కర్, నెల్లిమర్ల ఆర్ఐ వేమన దేవి, వివిధ కర్మాగారాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కౌమార బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ నాగలక్ష్మి


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: కౌమార బాలికల ఆరోగ్యంపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి రక్తహీనతతో బాధపడే వారికి మందులు అందజేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. జనగన్న ఆరోగ్య సురక్ష రిఫరల్ కేసులు, గర్భిణులు, కౌమార బాలికల్లో రక్తహీనత నివారణ తదితర అంశాలపై వైద్యారోగ్యశాఖ అధికారులు, వైద్యులు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందితో కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం సమీక్షించారు. ఈ నెలాఖరులోగా జగనన్న ఆరోగ్య సురక్ష రిఫరల్ కేసులన్నింటికీ వైద్యం అందించాలని ఆదేశించారు. కొన్ని పీహెచ్‌సీల పరిధిలో కనీసం 20 శాతం కేసులకు వైద్యం అందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాలో మొత్తం 2,439 రిఫరల్ కేసులు నమోదుకాగా, ఇప్పటి వరకు 569 మంది మాత్రమే వైద్యసేవలు పొందారన్నారు. మిగిలిన వారికి వైద్యసేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. వారిని సీహెచ్‌సీ, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు తరలించే బాధ్యత వైద్యాధికారులదేనని స్పష్టం చేశారు. రవాణా ఖర్చులను కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. జేఏఎస్ రిఫరల్ కేసులకు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, బాలికలకు ఇస్తున్న ఐరన్ మాత్రలను వినియోగించేలా చూసే బాధ్యత ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలపై ఉందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఎ.రమణి పాల్గొన్నారు.

‘విజన్ బిల్డింగ్’ శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, మహిళా సమాఖ్య అధ్యక్షులు

విజయనగరం రూరల్: గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ, జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు విజన్ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారంలో ఉన్న టీటీడీసీలో మంగళవారం ప్రారంభమైంది. ఇందులో విజయనగరం మండలంలోని 25 మంది మండల, గ్రామైక్య సంఘాల అధ్యక్షులకు, డీఆర్‌డీఏ- వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, జిల్లాలోని 10 మండలాల ఏపీఎంలు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన డీపీఎంఎస్, విశాఖ జిల్లా ఏపీఎంలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపిక చేసిన మోడల్ మండలాల్లో స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా నాయకుల సామర్థ్యాల పెంపు, సాంస్కృతిక మార్పు, నిర్మాణాత్మక అసమానతలను అధిగమించడం, జీవనోపాధుల మెరుగుకు ప్రణాళిక తయారీ, మహిళా నాయకుల సన్నద్ధత తదితర అంశాలపై శిక్షణ అందించారు. ఐదేళ్లలో వ్యాపార అభివృద్ధి, వార్షిక కార్యాచరణ ప్రణాళిక తయారు చేయడంతో పాటు, వాటి అమలుకు తగు చర్యలు తీసుకోవడం , మహిళా సమాఖ్యల మనుగడ సాధించే దిశగా నడిపించాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సెర్ప్ ఎగ్జిక్యూటివ్ కె.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ-వైకేపీ అదనపు పథక సంచాలకులు కె.సావిత్రి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల విజేతలకు కోలగట్ల అభినందన

- డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన క్రీడాకారులు


బాక్సింగ్ పోటీల విజేతలను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్రస్థాయి 7వ ఎలైట్ స్త్రీ, పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన క్రీడాకారులు రెండు స్వర్ణ, రెండు రజత, ఐదు కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్వగృహానికి మంగళవారం చేరుకున్న క్రీడాకారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలను సాధించి నగరానికి క్రీడా పరంగా మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డోల మన్మథ కుమార్ మాట్లాడుతూ ఇటీవల విశాఖపట్నంలో జరిగిన 7వ రాష్ట్రస్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో నగరానికి చెందిన 9 మంది క్రీడాకారులు వివిధ రకాల పథకాలను సాధించారన్నా రు. వారిలో జి.అచ్యుతరావు, ఎ.సాయి బంగారు పతకాలు, చంద్రశేఖర్, జగదీష్ నాయుడు రజత పతకాలు, దేవకేశ్వరరావు, సుల్తానా, సుమిత్ర, రాధా, మాధురి కాంస్య పతకాలు సాధించారన్నారు. స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులు ఈనెల 26వ తేదీన మేఘాలయలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర సభ్యుడు ఎస్ఈ రాజు, కోచ్ డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు కొత్తగూడ విద్యార్థి


ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులతో పీడీ మాధవరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి మండంగి సంతోష్ జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నిమ్మక మాధవరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎస్పీజీ స్కూల్ వేదికగా ఈనెల 15, 16వ తేదీలలో జరిగిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో ఫెన్సింగ్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు బి.రాజ్‌కుమార్, మండంగి సంతోష్ వెళ్లారని, ఈపీ (ఈపీఈఈ) బాలుర విభాగంలో వారు ప్రతిభ చూపి రజత పతకం సాధించారని తెలిపారు. అలాగే ఈపీ ఇండివిడ్యువల్ ఈవెంట్‌లో పాల్గొన్న మండంగి సంతోష్ ఉత్తమ ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలోని ఉద్గిరిలో డిసెంబర్17, 18, 19వ తేదీలలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో సంతోష్ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్‌ను హెచ్ఎం నాగరాజు, డిప్యూటీవార్డెన్ గంగారావు అభినందించారు.

టి 20 క్రికెట్ మ్యాచ్‌కు ట్రాఫిక్ డైవర్షన్



ట్రాఫిక్ రూట్‌మ్యాప్ విడుదల చేసిన జిల్లా పోలీస్‌శాఖ

విజయనగరం క్రైమ్: విశాఖపట్నంలోని మధురవాడలో గల ఏసీఏ వీడీసీఏ డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో నవంబరు 23న ఆస్ట్రేలియా- భారత్ మధ్య జరగనున్న అంతర్జాతీయ టీ -20 క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు, డైవర్షన్సను విధిస్తున్నట్లు విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పేర్కొన్నారని ఎస్పి ఎం.దీపిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకటనలో ఎస్పీ పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే ప్రజలు మ్యాచ్ ప్రారంభానికి 2 గంటల ముందుగా స్టేడియానికి చేరుకోవాలి. నవంబరు 23న రాత్రి 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ టి-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతుంది. స్టేడియంలో 28వేల కెపాసిటీ ఉంది. క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే వారు ఎక్కువ సంఖ్యలో వాహనాలతో క్రికెట్ స్టేడియానికి వచ్చే అవకాశం ఉన్నందున, క్రికెట్ మ్యాచ్‌తో సంబంధంలేని వాహనదారులు మధురవాడ క్రికెట్ స్టేడియం వైపు ప్రయాణించకుండా, వేరే మార్గాల్లో ప్రయాణించాలి. శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి విశాఖ సిటీలోకి వచ్చే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు మారికవలస వద్ద ఎడమవైపు తిరిగి, జురాంగ్ జంక్షన్ మీదుగా, తిమ్మాపురం చేరి, కుడివైపు తిరిగి బీచ్ రోడ్డులో ప్రయాణించి, రుషికొండ, సాగర్ నగర్, జోడుగుళ్లపాలెం, మీదుగా వెళ్లాలి.

- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు , ఆటోలు కారుషెడ్డు వద్ద నుంచి మిథిలాపురి కాలనీ మీదుగా, ఎంవీపీ సిటీ వెనుకగా వెళ్లి, లా కాలేజ్ రోడ్డు మీదుగా ఎన్‌హెచ్ 16 చేరి నగరంలోకి వెళ్లాలి. లా కాలేజ్ రోడ్డు నుంచి పనోరమ హిల్స్ మీదుగా రుషికొండ మీదుగా నగరంలోకి వెళ్లవచ్చు.
- విశాఖ సిటీలో నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు హనుమంతవాక నుంచి ఎడమవైపు తిరిగి ఆరిలోవ, బీఆర్‌టీఎస్, రోడ్డులో వెళ్లి, అడవివరం వద్ద కుడివైపు తిరిగి ఆనందపురం మీదుగా వెళ్లాలి.
- విశాఖ సిటీ నుంచి ఆనందపురం, విజయనగరం , శ్రీకాకుళం వైపు వెళ్లే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు హనుమంత వాక జంక్షన్ నుంచి ఎడమవైపు తిరిగి అడివివరం మీదుగా ఆనందపురం వెళ్లవచ్చు, లేదా హనుమంతవాక జంక్షన్, లేదా విశాఖ వ్యాలీ జంక్షన్ లేదా, ఎండాడ జంక్షన్ వద్ద కుడివైపు తిరిగి, బీచ్ రోడ్డు చేరి, తిమ్మాపురం వద్ద ఎడమవైపు తిరిగి, మారికవలస వద్ద ఎన్‌హెచ్ 16 చేరవచ్చు.

భారీ వాహనాలకు సూచనలు

- ఈ నెల 23న ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ ఎటువంటి భారీ వాహనాలు మధురవాడ స్టేడియం వైపు అనుమతించబడవు.
- అనకాపల్లి నుంచి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లు వాహనాలు, నగరంలోకి రాకుండా, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా వెళ్లాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, వైపు నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలు, నగరంలోకి రాకుండా, ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి వైపు వెళ్లాలి.